క్లుప్తంగా

వరహాలబాబుకు అభినందనలు



వరహాలబాబును పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న రిజర్వేషన్ సిస్టమ్ జిల్లా ఇన్‌చార్జి ఎస్.వరహాలబాబును శనివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పుష్పగుచ్ఛంతో అభినందించారు. శనివారం వరహాలబాబు భట్నవిల్లిలో మంత్రి విశ్వరూప్‌ను కలుకున్నారు. ఆయనతో పాటు జిల్లా రవాణా అధికారి ఆర్‌వీఎస్ నాగేశ్వరరరావు, డీఎం చల్లా సత్యనారాయణమూర్తిలున్నారు.

ఎంపీ అనురాధను కలిసిన రవిదేవి



రవిదేవి దంపతులను శాలువాతో సత్కరిస్తున్న ఎంపీ అనురాధ

అల్లవరం: ఇటీవల కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన రెడ్డి రవిదేవి మొగళ్ళమూరులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ చింతా అనురాధను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవిదేవి దంపతులను ఎంపీ అనురాధ శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట వాసంశెట్టి సుభాష్, కుడుపూడి వెంకటేశ్వరరావు, దూనబోయిన శ్రీనివాస్, రెడ్డి చంటి తదితరులున్నారు.

పోలీసుల్ని ఆశ్రయించిన ప్రేమ జంట

అల్లవరం: రెండేళ్లుగా ప్రేమించుకుని పెళ్లి చేసుకున్న ప్రేమ జంటకు పెద్దల అంగీకరించకపోవడంతో శనివారం అల్లవరం పోలీసుల్ని ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే అల్లవరం మండలం పోతులవారిపేటకు చెందిన జంగా భానుప్రకాష్, అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారానికి చెందిన ఓ యువతి రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ప్రేమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోకపోవడంతో అమలాపురంలోని బుద్ధవిహార్‌లో పెళ్లి చేసుకుని శనివారం పోలీసులను ఆశ్రయించి రక్షణ కోరారు.

గోశాల, వేంకటేశ్వరస్వామి ఆలయాలకు విరాళాలు



గోశాల, వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతినిధులకు విరాళం అందిస్తున్న బాబి

అమలాపురం టౌన్: స్థానిక శ్రీగౌతమ మహర్షి గోసంరక్షణ సమితి గోశాల, అంబాజీపేట వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వంటెద్దు బాబి మొత్తంగా రూ.10 వేల విరాళాన్ని సమకూర్చారు. గోశాల ట్రస్ట్ ప్రతినిధులకు రూ.5,116, వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు రూ.5,116 వంతున బాబి అమలాపురంలో శనివారం అందజేశారు.

శ్మశానానికి కేటాయించిన స్థలం పరిశీలన

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ బాబానగర్ గ్రామానికి కేటాయించిన శ్మశాన స్థలాన్ని సీపీఎం పార్టీ, వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ జిల్లా నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామ ప్రజల కోరిక మేరకు అధికారులు కేటాయించిన శ్మశాన స్థలాన్ని సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేసి గ్రామానికి దఖలు పరచాలని కోరారు. కార్యక్రమంలో టేకుమూడి ఈశ్వరరావు, కమిడి సత్యశ్రీనివాస్, కూరాకుల సింహాచలం, వడ్డి ఏడుకొండలు, విప్పర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తాళ్లరేవు: రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వేలూరి సూర్యనారాయణ అన్నారు. శనివారం పైడా గ్రూపు విద్యాసంస్థల కరస్పాండెంట్ పైడా శ్రీరామ్ జన్మదినోత్సవం సందర్భంగా కళాశాలలో లయన్స్ క్లబ్, రెడ్‌క్రాస్ సంస్థల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 80 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్ వీరభద్రరావు, డిప్యూటీ డైరెక్టర్ కె.రవీంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ కేశవరావు, బాదం బాలకృష్ణ పాల్గొన్నారు.

ఉప ఎన్నికలు ప్రశాంతం



గుత్తాల జ్యోతికి విజేతగా ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న దీక్షితులు



సంధ్యారాణికి విజేతగా ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

ఐ.పోలవరం: మండలంలోని టి.కొత్తపల్లి గ్రామంలో శనివారం జరిగిన 3వ వార్డు ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. వార్డులో 425 ఓట్లు ఉండగా 268 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుత్తాల జ్యోతికి 185 ఓట్లు రాగా, సవరపు వెంకటరమణకు 81 ఓట్లు, చెల్లని ఓట్లు 2 వచ్చినట్లు ఎన్నికల పీఓ దీక్షితులు తెలిపారు. 104 ఓట్లతో గుత్తాల జ్యోతి(వైఎస్సార్ సీపీ మద్దతు రాలు) గెలుపొందినట్లు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

నలుగురు వార్డు సభ్యుల ఏకగ్రీవం

కాట్రేనికోన: మండలంలోని నలుగురు వార్డు సభ్యులు ఏకగ్రీవమైనట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటాచలం తెలిపారు. మండలంలో బంటుమిల్లి పంచాయతీలో ఒక వార్డుకు పలివెల నాగదుర్గలక్ష్మి(వైఎస్సార్ సీపీ), కొప్పిగుంట గ్రామ పంచాయతీలో ఒక వార్డుకు కొప్పిశెట్టిదుర్గ(వైఎస్సార్ సీపీ) కాట్రేనికోన పంచాయతీలో రెండు వార్డులకు గెడ్డం నాగేశ మునేంద్రకుమారి(వైఎస్సార్ సీపీ), వత్సవాయి సాయిబాబురాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉప ఎన్నికల్లో గెలుపొందిన సంధ్యారాణి

అల్లవరం: కొమరగిరిపట్నం నాలుగో వార్డులో శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి ఉల్లింగి సంధ్యారాణి, సమీప అభ్యర్థి కాట్రు అనుసూయపై 95 ఓట్ల మెజారిటీతో గెలిపొందింది. సంధ్యారాణికి 208 కోట్లు, అనుసూయకి 113 ఓట్లు పోలైయ్యాయని స్టేజ్ –1 అధికారి ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. స్టేజ్–2 అధికారిగా సూరపరాజు వ్యవహరించారు.

జార్జిపేట సర్పంచ్‌గా సత్యవేణి గెలుపు



గుత్తుల సత్యవేణి

తాళ్లరేవు: జార్జిపేట పంచాయతీ ఉప ఎన్నికల్లో గుత్తుల సత్యవేణి విజయం సాధించారు. ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు పోటీ పడగా కత్తెర గుర్తుపై పోటీ చేసిన గుత్తుల సత్యవేణికి 1333 ఓట్లు రాగా, ఉంగరం గుర్తుపై పోటీ చేసిన సమీప అభ్యర్థి రెడ్డి భాగ్యలక్ష్మికి 968 ఓట్లు పోలయ్యాయి. మంచం గుర్తుపై పోటీ చేసిన మరొక అభ్యర్థి కానూరి సూర్యావతికి 123 ఓట్లు పోలవగా నోటాకు 65 ఓట్లు పోలయ్యాయి. 33 ఓట్లు చెల్లకుండా పోయాయి. గుత్తుల సత్యవేణి 365 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి విద్యాసాగర్‌కుమార్ ప్రకటించి ధ్రువీకరణ పత్రం అందజేశారు.

22 నుంచి సాయం సొమ్ము జమ

యానాం: వివాహ ఆర్థిక సహాయానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 22 నుంచి వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ అవుతుందని మహిళా, శిశు అభివృద్ధి శాఖ అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనకబడిన కుటుంబాల్లో మహిళలకు వివాహ ఆర్థిక సహాయం రూపేణా రూ.25 వేల చొప్పున మంజూరవుతుంది. ప్రస్తుతం 800 మంది లబ్ధిదారులకు కలిపి రూ.2 కోట్లు బ్యాంకు ఖాతాల్లో పడుతుందన్నారు.

6వ వార్డులో మురికి నీరు

అమలాపురం టౌన్: పట్టణంలోని ఆరో వార్డులోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి కుళాయిల నుంచి శనివారం ఉదయం మురికినీరు రావడంతో స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వాటర్ వర్క్స్‌కు చెందిన ట్యాప్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది ఆ వార్డుకు వెళ్లి మురికి నీరు వస్తున్న కుళాయిలను పరిశీలించారు. మురికిగా వచ్చిన నీటి నుంచి శాంపిళ్లను సేకరించారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, ఇంజినీర్లు తక్షణమే స్పందించి నీరు మురికిగా రావడానికి గల కారణాలపై ఆరా తీశారు. వాటర్ పైపు లైన్లలో ఎక్కడో లీకులు ఉండడం వల్ల కుళాయిల నుంచి మురికి నీరు వస్తుందని అంచనా వేస్తున్నారు. దీంతో లీకులను గుర్తించే పనిలో వాటర్ వర్క్స్ సిబ్బంది నిమగ్నమయ్యారు. సమస్యను ఎక్కడుందో గుర్తించి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపడతామని కమిషనర్ నాయుడు తెలిపారు.

నిరుపేదల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యం



రంగాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న మంత్రి విశ్వరూప్, శ్రీకాంత్

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- రంగాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

అమలాపురం రూరల్: నిరుపేదల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. అమలాపురం రూరల్ మండలం సమనస రంగాపురం బాబునగర్‌లో శనివారం ఆయన తన కుమారుడు పినిపే శ్రీకాంత్‌తో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధిని గత నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్ గోపాల్, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎఎంసీ వైస్ చైర్మన్ బడుగు మేరీకుమారి, వైస్ ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, వైఎస్సార్ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, మొసలి స్పర్జన్ రాజు, ఎంపీటీసీలు ఉడుం రామకృష్ణ, రేవు శ్రీను, కరేళ్ళ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రాఫర్ల దినోత్సవం

అమలాపురం టౌన్: జిల్లా ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం గడియారం స్తంభం సెంటరులో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ ద్వారంపూడి దుర్గాశేఖరరెడ్డి ఫొటోగ్రఫీ జెండా ఎగురవేసి కెమెరా సృష్టికర్త డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ సభ్యుల్లో ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు జిల్లా అసోసియేషన్ ఏర్పాటుచేసిన డాగురే సురక్ష యోజన పథకం ద్వారా ఇటీవల అమలాపురంలో మరణించిన ఫొటోగ్రాఫర్ కేవీఆర్ స్టూడియో రాజు కుటుంబానికి రూ.2 లక్షలను సీఐ దుర్గా శేఖరరెడ్డి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఖ్వాజాబాబు, సీవీ రావు, జిల్లా అధ్యక్షుడు గెద్దం సురేష్‌కుమార్, కార్యదర్శి దొరబాబు, ఉపాధ్యక్షుడు మనోజ్ కుమార్, కోశాధికారి గోపీకృష్ణ, నగేష్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబసభ్యులకు రూ.2 లక్షల సాయం అందిస్తున్న సీఐ దుర్గా శేఖరరెడ్డి తదితరులు

ముమ్మిడివరం: మండల ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ముమ్మిడివరంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు గుత్తుల నాగు ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ జెండాను ఆవిష్కరించారు. ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కముజు శ్రీనివాస్, గాలిదేవర సత్తిబాబు, ఎండీ దిల్సాన్, అఖిల్, ఎం.రమేష్, చప్పిడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కాట్రేనికోనలో లూయిస్ డాగురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు

కాట్రేనికోన: మండల కేంద్రం కాట్రేనికోనలో ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కోలాటి సత్యం, మండల శాఖ అధ్యక్షుడు అర్జున్, జిల్లా కార్యవర్గ సభ్యులు గాలిదేవర సురేష్, సెక్రటరీ నాగేంద్ర, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



లుమినీ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తాళ్లరేవు: నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారానే ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని కైట్ పూర్వ విద్యార్థులు తెలిపారు. శనివారం కోరంగి కైట్ ఇంజినీరింగ్ కళాశాలలో లుమినీ అనే కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. కైట్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుకుని బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ నగరాల్లోని టీసీఎస్ సంస్థలో ఉద్యోగాలు సాధించిన 50 మంది పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు సంబంధించి ఏఐ కోర్సులను అభ్యసించాలన్న విషయంపై కూలంకషంగా వివరించారు. అనంతరం పూర్వ విద్యార్థులను కైట్ కళాశాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కైట్ ప్రిన్సిపాల్ రేవతి దూబే, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఏడిద రామకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ రామ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'108'లో ప్రసవం



108 అంబులెన్స్‌లో దివ్య ప్రసవించిన బిడ్డతో ఈఎంటీ గాయత్రి

అమలాపురం టౌన్: ప్రసవ వేదనతో బాధపడుతున్న ఓ గర్భిణి 108 అంబులెన్స్‌లోనే ప్రసవించింది. వివరాల్లోకి వెళితే కాట్రేనికోన మండలం పల్లంకుర్రుకు చెందిన గర్భిణి వడ్డి అక్షిత దివ్య(25)కు నెలలు నిండడంతో అమలాపురం ఆస్పత్రిలో ప్రసవానికి చేర్చారు. అయితే శనివారం ఉదయం ఆమెకు కాన్పు కష్టతరం కావడంతో 108 అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. కాకినాడ నగరంలోకి చేరిన తర్వాత ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. 108 అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) గాయత్రి అత్యవసర వైద్యం అందించి సులువుగా ప్రసవించేందుకు సహకరించారు. దివ్య మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యులతో పూర్తి వైద్య సహాయం అందజేశారు. ప్రస్తుతం తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

సరైన ఆహార అలవాట్లతోనే ఆరోగ్యం

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



ఎడిబుల్ బిస్కెట్ టీ కప్పులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్: ప్రస్తుత యాంత్రిక జీవనంలో సరైన ఆహార అలవాట్లతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. అమలాపురం మెయిన్ రోడ్డులో కెనరా బ్యాంక్ సమీపంలో శ్రీఅనిత ఇండస్ట్రీస్ సంస్థ ఏర్పాటు చేసిన ఎడిబుల్ బిస్కెట్ టీ కప్పు తయారీ పరిశ్రమను జిల్లా కలెక్టర్ శుక్లా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడిబుల్ బిస్కెట్ టీ కప్పులో టీ లేదా ఇతర పానీయాలను తాగిన తరువాత ఆ కప్పును తినే యొచ్చని చెప్పారు. ఈ ఎడిబుల్ బిస్కెట్ కప్పులను రాగి, మొక్కజొన్న, గోధుములు వంటి చిరు ధాన్యాలు, కొబ్బరి తదితర ఫ్లేవర్లతో తయారు చేయడం వల్ల ఈ కప్పులో పోషక విలువలుంటాయన్నారు. ప్రస్తుతం వాడుతున్న ప్లాస్టిక్, పేపర్ కప్పులకు బదులు ఎడిబుల్ బిస్కెట్ కప్పులను వినియోగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి బీవీ రమణ, ఎల్డీఎం ప్రసాద్, డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డీవీఎల్ అన్నపూర్ణ, శ్రీ అనిత ఇండస్ట్రీస్ పరిశ్రమ స్థాపకురాలు దానాల అనిత తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 24న రామానుజన్ పరీక్ష

యానాం: రామానుజ గణిత అకాడమీ యానాం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే రామానుజన్ పరీక్ష సెప్టెంబర్ 24న నిర్వహించనున్నట్లు అకాడమీ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ విద్యార్థులకు మాత్రమే నిర్వహిస్తారన్నారు. పరీక్ష ఫీజును ఆగస్టు 30లోగా చెల్లించాలని కోరారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శివరామరాజు

అమలాపురం రూరల్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్రాంచ్ డీఎస్పీ శివరామరాజు అన్నారు. స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాలలో నిషాముక్తి భారతి, కోనసీమ సేవ మండలి ఆధ్వర్యంలో శనివారం సాయత్రం డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శివరామరాజు మాట్లాడుతూ తమ శాఖ ద్వారా అవగాహన సదస్సులు నిర్వహిస్తూ యువతను మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంచడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీరాంకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్ శాస్త్రి, డ్రగ్స్ డీ అడిక్షన్ సిబ్బంది ప్రసంగించారు.

ర్యాగింగ్ చేయడం తీవ్ర నేరం

అవగాహన సదస్సులో జిల్లా జడ్జి నరేష్



అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి నరేష్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రామారావు

అమలాపురం రూరల్: ర్యాగింగ్ చేయడం తీవ్ర నేరమని, అటువంటి నేరాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు పడతాయని అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ తెలిపారు. శనివారం భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ర్యాగింగ్ వంటి దుష్ట సాంప్రదాయానికి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ చట్టాల గురించి ఆయన వివరించారు. ముఖ్యంగా అమ్మాయిలకు ఉన్న హక్కుల గురించి, చట్టాల గురించి అర్థమయ్యేలా అవగాహన కల్పించారు.

అనంతరం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ జక్కం వెంకట కృష్ణారావు, యాంటీ రాగింగ్ కమిటీ కోఆర్డినేటర్ శేషారావు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు కరాటం రవిసుధీర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



పాశర్లపూడిలో లారీ ఢీకొట్టడంతో దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్

మామిడికుదురు: పాశర్లపూడి పెట్రోల్ బంకు సమీపంలో శనివారం త్రుటిలో ప్రమాదం తప్పింది. రాజోలు వైపు తవుడు లోడుతో వెళ్తున్న లారీ 216వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి ట్రాన్స్‌ఫార్మర్ వైపు దూసుకుపోయింది. హైటెన్షన్ తీగలతో కూడిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు రెండు విద్యుత్ స్తంభాలు లారీ స్పీడుకు దెబ్బతిన్నాయి. హైటెన్షన్ విద్యుత్ తీగలు తెగి పడిపోయాయి. చీకటి సమయం కావడంతో పాటు ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సంబంధిత శాఖ అధికారులు పాడైపోయిన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించడంతో పాటు దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టారు.

కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగతం

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది శనివారం స్వాగతం పలికారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబా అధ్యక్షతన స్టూడెంట్ ఇంట్రడక్షన్ ప్రోగ్రాం (ఎస్ఐపీ) నిర్వహించారు. పట్టుదలతో డిగ్రీ పూర్తి చేసి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ప్రిన్సిపాల్ సాయిబాబా పిలుపునిచ్చారు. కళాశాలలో గ్రంథాలయం, ల్యాబ్, జేకేసీ సెంటర్ సదుపాయాలతో పాటు నిరంతరం శ్రమించే అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీరామ్మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ టీఎస్‌వీ పద్మనాభం, అధ్యాపకులు రాజ్‌కుమార్, నల్లి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కర్బలా అమరవీరులకు నివాళి

మామిడికుదురు: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా శనివారం కర్బలా అమర వీరులకు ముస్లింలు ఘనంగా నివాళులర్పించారు. కర్బలా సంఘటనల అనంతరం జరిగిన పరిణామాలను గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. హజరత్ ఇమామ్ హుస్సేన్ పరివారాన్ని బందీలుగా చేసి కూఫా, సిరియాల్లో బహిరంగంగా ఊరేగించిన సంఘటనలను మత ప్రబోధకులు భక్తులకు వివరించారు. మామిడికుదురులోని హజరత్ అబ్బాస్ పంజాలోను, ఖమారే బన్నీ హాసిమ్, షహజాదే ఖాసిం పంజాల్లో జరిగిన కార్యక్రమాల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: మండలంలోని మందపల్లిలో శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం ఏసీ అండ్ ఈఓ సింగం రాధ, సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టికెట్లు, వివిధ సేవల ద్వారా రూ.87,552 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. అన్నదానానికి పలువురు భక్తుల విరాళాల రూపంలో మరో రూ.5,348 ఆదాయం వచ్చినట్లు ఈఓ రాధ తెలిపారు.

గ్రావెల్ లోడుతో టిప్పర్ బోల్తా

కాట్రేనికోన: గొరగనమూడి ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి పి.లక్ష్మివాడకు నూతనంగా నిర్మిస్తున్న రహదారిపై గ్రావెల్ లోడుతో వెళుతున్న టిప్పర్ శనివారం రోడ్డు పక్కన బెర్మ్ వద్ద దిగబడిపోవడంతో అదుపు తప్పి పంట కాలువలో బోల్తా పడింది. ప్రమాదాన్ని ముందే గ్రహించిన డ్రైవర్, క్లీనర్‌లు టిప్పర్‌లోంచి దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డారు.

PUBLIC NOTICE

Arigela Manikyamba, W/o. Venakala Durga Prasad, S/o. Sambasiva Rao, D No 5-2-70/2, Muslim Street Area, Amalapuram, Dr BR Ambedkar Konaseema Dist - applied for loan from M/s. Shriram Finance Ltd., Chennai, having branch office at Amalapuram the security of the schedule mentioned property of Arigela Venkata Durga Prasad. If anybody has objection or attachments or any other interests over the properties should inform to the undersigned within 7 days from this day. Dr BR Ambedkar Konaseema Dist., Amalapuram SRO, Gollavilli Panchayat and village, Uppalaguptam Mandal Z Dry RS No 59-5 an extent of ac. 0.05 cents = 242 sq yds vacant site is bounded by E: Road, S: Site and house of Kasani Kumara Swami, W: Site and house of Nagireddi Veeraju families, N: Site and house of Saladi Poola Kapu families In between the above boundaries with all easement rights etc., therein.

DVVS MURTHY, Advocate
Amalapuram. 98483 44577

